క్లుప్తంగా

బాలుర వసతిపై ప్రత్యేక శ్రద్ధ అవసరం



అధికారులతో మాట్లాడుతున్న కేసలి అప్పారావు

ఎంవీపీ కాలనీ: ఆరిలోవలోని ప్రభుత్వ బాలుర వసతి గృహం, బాలుర పరిశీలన కేంద్రాలను రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ చైర్మన్ కేసలి అప్పారావు మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా కేంద్రం పనితీరును అధికారులు ఆయనకు వివరించారు. అనంతరం కేసలి మాట్లాడుతూ వసతి ఏర్పాట్లు, సౌకర్యాల విషయంలో రాజీలేని నిర్ణయాలు తీసుకోవాలన్నారు. విద్యార్థుల అభిరుచికి అనుగుణంగా వారికి నచ్చిన రంగంలో ప్రోత్సహించాలన్నారు. కొత్తగా నిర్మిస్తున్న బాలుర పరిశీలన భవనాన్ని వీలైనంత త్వరగా అందుబాటులోకి తీసుకురావాలన్నారు. మంగళవారం అందించిన ఆహారాన్ని పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో బాలల న్యాయ మండలి సభ్యుడు భాస్కరరావు, పర్యవేక్షణ అధికారులు రామ్మోహన్, వీరయ్య, మిషన్ వాత్సల్య సిబ్బంది అనూజ, తదితరులు పాల్గొన్నారు.

వృద్ధులకు రుషికొండ వెంకన్న దర్శనం



వేంకటేశ్వరస్వామి ఆలయంలో దర్శనానికి వచ్చిన వృద్ధులు

మురళీనగర్: పట్టాభిరెడ్డితోటలోని వానప్రస్థ వృద్ధాశ్రమంలో ఆశ్రయం పొందుతున్న వృద్ధులకు వెంకన్న దర్శనం లభించింది. వృద్ధాశ్రమం నిర్వాహకుడు రొబ్బి శ్రీనివాస్ ఇక్కడ ఆశ్రయం పొందుతున్న వృద్ధుల కోరిక మేరకు రుషికొండ సమీపంలోని తిరుమల తిరుపతి దేవస్థానం ఆధ్వర్యంలో నెలకొల్పిన వేంకటేశ్వరుడి ఆలయానికి మంగళవారం తీసుకుని వెళ్లారు. వీరు స్వామి దర్శించుకుని ఆలయంలో కాసేపు ఆనందంగా గడిపారు. స్వామి దర్శన భాగ్యం కల్పించిన శ్రీనివాస్‌కు కృతజ్ఞతలు తెలిపారు.

ఘనంగా ఆర్కే నారాయణ్ జయంతి



ఆర్కే నారాయణ్ గురించి వివరిస్తున్న ప్రిన్సిపాల్ విజయబాబు

మద్దిలపాలెం : రచయిత ఆర్కే నారాయణ్ 117వ జయంతిని మద్దిలపాలెం డాక్టర్ వీఎస్ కృష్ణా ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్కే నారాయణ్ చిత్ర పటానికి ప్రిన్సిపాల్ విజయబాబు, తదితరులు పూలమాల వేసి అంజలి ఘటించారు. అనంతరం ఆర్కే నారాయణ్ రచనల గురించి విద్యార్థులకు వివరించారు. ఈ కార్యక్రమంలో కళాశాల ఆంగ్ల అధ్యాపకురాలు ఆర్.రాణి, పద్మప్రియ, ఎస్.వి.రామారావు, సి.వి.ఎస్.రవీంద్రనాథ్ పాల్గొన్నారు.

ఇంటర్మీడియట్ సర్టిఫికెట్ల అందజేత

మద్దిలపాలెం : డాక్టర్ వీఎస్ కృష్ణా ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్మీడియట్ సర్టిఫికెట్లను పంపిణీ చేస్తున్నామని కళాశాల ప్రిన్సిపాల్ సుజాత ఒక ప్రకటనలో తెలిపారు. ఈ ఏడాది ఇంటర్ ఉత్తీర్ణులైన వారు తమ సర్టిఫికెట్లు తీసుకోవాలని ఆమె సూచించారు. కళాశాల పనివేళల్లో విద్యార్థులు కళాశాల కార్యాలయంలో సంప్రదించాలని పేర్కొన్నారు.

ప్రగతి హాస్టల్‌కు కొత్త సొబగులు



షెడ్‌కు పూర్తిస్థాయిలో మరమ్మతులు



టాయిలెట్స్ లోపల భాగం

- యుద్ధ ప్రాతిపదికన ఆధునికీకరణ పనులు
- ఏయూ విద్యార్థినులకు మెరుగైన వసతుల కల్పన

ఏయూ క్యాంపస్: ఆంధ్ర విశ్వవిద్యాలయం విద్యార్థినుల వసతిగృహం ప్రగతి.. నూతన సొబగులు అద్దుకుంటోంది. విద్యార్థుల అవసరాలకు అనుగుణంగా హాస్టల్ భవనాన్ని ఆధునికీకరిస్తున్నారు. వంటశాల, భోజన శాల, టాయిలెట్స్ బ్లాక్స్‌ని పూర్తిస్థాయిలో తీర్చిదిద్దుతున్నారు. దశాబ్దాల క్రితం నిర్మించిన ప్రగతి వసతి గృహాన్ని విద్యార్థినుల సౌకర్యార్థం వినియోగిస్తున్నారు. ఇటీవల హాస్టల్ భవనాన్ని పరిశీలించిన వీసీ ఆచార్య ప్రసాదరెడ్డి తక్షణం మరమ్మతులకు ఇంజినీరింగ్ విభాగ అధికారులను ఆదేశించారు. ఈ మేరకు పనులు ప్రారంభించిన అధికారులు.. సరికొత్తగా విద్యార్థులకు స్వాగతం పలికే విధంగా హాస్టల్ గదులు, భవనాన్ని తీర్చిదిద్దుతున్నారు.

పక్కా ప్రణాళికతో పనులు

పనులను ప్రణాళికాబద్ధంగా చేపడుతున్నారు. చేపట్టాల్సిన మరమ్మతులు, మౌలిక వసతుల కల్పనపై ఒక ప్రణాళిక సిద్ధం చేసుకుని అమలు చేస్తున్నారు. ప్రతి అంతస్తులో టాయిలెట్స్ బ్లాక్‌ను పూర్తిగా ఆధునికీకరిస్తున్నారు. గదులకు అవసరమైన తలుపులు, కబోర్డ్‌లు ఏర్పాటు చేశారు. భవనం లోపల, బయట పెయింటింగ్ పనులు ఇప్పటికే ప్రారంభించారు. మరో వైపు ప్రగతి హాస్టల్ వెనక భాగంలో ఒక పెద్ద షెడ్ దీర్ఘ కాలంగా నిరుపయోగంగా ఉంది. దీనిపై ఉండే రేకులు విరిగిపోయి శిథిలావస్థకు చేరుకుంది. దీనిని పూర్తిగా తొలగించకుండా మరమ్మతులు చేపడుతున్నారు. షెడ్ పైనున్న, విరిగిన రేకులు తొలగించి, గదుల ఎత్తును పెంచారు. అవసరమైన ప్రాంతాలలో ప్లాస్టింగ్ పనులు పూర్తి చేశారు. తరువాత కొత్త రేకులు ఏర్పాటు చేస్తున్నారు. హాస్టల్ కార్యాలయం, విద్యార్థుల తల్లిదండ్రులు వచ్చినప్పుడు ఉండడానికి వీలుగా డార్మెటరీ తరహాలో సదుపాయం కల్పించేలా అధికారులు చర్యలు తీసుకుంటున్నారు.

'గడప గడప'కు విశేష స్పందన



ప్రజలతో మాట్లాడుతున్న ఎంపీ ఎంవీవీ సత్యనారాయణ

ఏయూ క్యాంపస్: గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమానికి ప్రజల నుంచి విశేష స్పందన లభిస్తోందని విశాఖ ఎంపీ, వైఎస్సార్‌సీపీ తూర్పు నియోజకవర్గ సమన్వయకర్త ఎంవీవీ సత్యనారాయణ అన్నారు. జీవీఎంసీ 9వ వార్డు కార్పొరేటర్ ఉమ్మిడి స్వాతి దాస్‌తో కలిసి ఆయన మంగళవారం గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. విశాలాక్షినగర్, చలపతినగర్‌లో పర్యటించారు. ఇంటింటికీ వెళ్లి సంక్షేమ పథకాల అమలుపై ఆరా తీశారు. స్థానిక సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ నిరంతరం ప్రజల మధ్యనే తిరుగుతుండడం ఆనందంగా ఉందన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కృషితో ప్రతి ఇంటికి ఆర్థిక భరోసా లభించిందన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ వార్డు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

పోర్ట్ చైర్మన్ అంగముత్తుతో ఎంపీ భేటీ



అంగముత్తుతో చర్చిస్తున్న ఎంపీ ఎంవీవీ సత్యనారాయణ

ఏయూ క్యాంపస్: విశాఖ పోర్ట్ ట్రస్ట్ చైర్మన్ అంగముత్తుని విశాఖ ఎంపీ ఎంవీవీ సత్యనారాయణ మంగళవారం మర్యాద పూర్వకంగా భేటీ అయ్యారు. పోర్ట్‌లో పలు వాణిజ్య రవాణా సౌకర్యాలు, ఇతర అంశాలపై చర్చించారు.

ఎంపీ ఎంవీవీని కలిసిన ఏయూ ఉద్యోగులు



ఎంపీకి వినతిపత్రం అందజేస్తున్న ఏయూ ఉద్యోగులు

ఎంవీపీ కాలనీ: ఆంధ్ర విశ్వవిద్యాలయం కాంట్రాక్ట్(28 రోజులు, కన్సాలిడేట్, హాస్టల్ డైలీ వేజ్) ఉద్యోగులు విశాఖ ఎంపీ ఎంవీవీ సత్యనారాయణను మంగళవారం తన కార్యాలయంలో కలిశారు. స్థానిక 20, 21 వార్డుల వైఎస్సార్‌సీపీ నాయకులతో మధుపాడ రవి, మువ్వల సురేష్‌తో కలిసి ఎంవీవీతో సమావేశమై వారి సమస్యలు విన్నవించుకున్నారు. దశాబ్దాలుగా ఏయూలో 28 రోజులు, కన్సాలిడేట్, డైలీవేజ్ ఉద్యోగులుగా పనిచేస్తున్న తమను టైం స్కేల్, పర్మినెంట్ ఉద్యోగస్తులుగా నియమించాలని కోరారు. ఈ మేరకు వర్సిటీ ఉన్నతాధికారులతో చర్చించి న్యాయం చేయాలని కోరుతూ వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఎంవీవీ మాట్లాడుతూ ఉద్యోగుల తరపున ఉన్నతాధికారులతో మాట్లాడి న్యాయం చేస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఏయూ ఆల్ హాస్టల్స్ డైలీ వర్కర్స్ అసోసియేషన్ గౌరవ అధ్యక్షుడు డి.అచ్చిరాజు, అధ్యక్షుడు కొయ్య కాశి, ఉపాధ్యక్షుడు పి.మంగరాజు, ప్రధాన కార్యదర్శి జి.నరేష్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో పందిరి రాట



రాట మహోత్సవంలో పాల్గొన్న ఎమ్మెల్సీ వంశీకృష్ణ, అక్కరమాని వెంకటరావు

ఎంవీపీ కాలనీ: శ్రీదేవి శరన్నవరాత్రి వేడుకల్లో భాగంగా జీవీఎంసీ 18వ వార్డు అప్పుఘర్‌లో మంగళవారం పందిరి రాట వేశారు. ఎమ్మెల్సీ వంశీకృష్ణ శ్రీనివాస్, వైఎస్సార్‌సీపీ నాయకుడు అక్కరమాని వెంకటరావు, 18వ వార్డు వైఎస్సార్‌సీపీ ఇన్‌చార్జి పుక్కళ్ల ధనలక్ష్మి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పుక్కళ్ల శంకర్, తదితరులు పాల్గొన్నారు.

వృద్ధులకు దుప్పట్లు, పండ్ల పంపిణీ



ఆశ్రమ వృద్ధులకు దుప్పట్లు పంపిణీ చేస్తున్న నాగరాజు తదితరులు



అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న నిరాశ్రయులు

ఎంవీపీ కాలనీ: జీవీఎంసీ 17వ వార్డులోని ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ ఆశ్రమంలోని వృద్ధులకు దుప్పట్లు, పండ్లు పంపిణీ చేశారు. ప్రపంచ నిరాశ్రయుల దినోత్సవం సందర్భంగా విశాఖ గాయనీ గాయకుల సాంస్కృతిక సంఘం, ఎస్ఎస్ఎస్ సత్య సముద్ర స్వరాల సంగీతం ఆధ్వర్యంలో మంగళవారం ఈ కార్యక్రమం జరిగింది. వైఎస్సార్‌సీపీ యువజన విభాగం రాష్ట్ర కార్యదర్శి గేదెల నాగరాజు పాల్గొని నిరాశ్రయులకు దుప్పట్లు, పండ్లు అందజేశారు. ఈ కార్యక్రమంలో జైభీమ్ కన్వీనర్ కోన ప్రకాష్, రెడ్ క్రాస్ సొసైటీ మేనేజర్ మురళి, తదితరులు పాల్గొన్నారు.

బీచ్ రోడ్డు: అమ్మ, నాన్న సోషల్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో పట్టణ నిరాశ్రయుల వసతి గృహంలో మంగళవారం అల్పాహారం అందజేశారు. ప్రపంచ నిరాశ్రయుల దినోత్సవం సందర్భంగా ఆరిలోవలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వసతి గృహం మేనేజర్ వై.రమణ, బి.పరదేశమ్మ, వి.దేవిప్రసాద్ పాల్గొన్నారు.

అనుమానాస్పద వ్యక్తులపై సమాచారమివ్వాలి



సంగం ఆఫీస్ వద్ద అపార్టుమెంట్‌లో అవగాహన కల్పిస్తున్న సీఐ విజయకుమార్

సీతమ్మధార: ఫోర్తుటౌన్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని అక్కయ్యపాలెంలో సంగం ఆఫీస్ వద్ద అపార్టుమెంట్ వాసులకు సీసీ కెమెరాలపై సీఐ ఎస్.విజయకుమార్ అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ అందరూ సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని, ఒక కెమెరా వంద మంది పోలీసులతో సమానమని తెలిపారు. అనుమానాస్పద వ్యక్తులు కనిపిస్తే తక్షణమే సంబంధిత పోలీస్ స్టేషన్‌కు సమాచారం ఇవ్వాలన్నారు. నగదు,బంగారం బ్యాంక్ లాకర్లలో భద్రపరుచుకోవాలని, వేరే ఊరు వెళ్లేటప్పుడు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. నేరాలు జరగకుండా అప్రమత్తంగా ఉండాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐ ప్రమీల, పోలీసు సిబ్బంది, అపార్టుమెంట్ వాసులు పాల్గొన్నారు.

శ్రావ్యంగా గాత్ర కచేరీ



గాత్ర కచేరీ చేస్తున్న లలితా చంద్రశేఖర్

మద్దిలపాలెం : విశాఖ మ్యూజిక్ అకాడమీ ఆధ్వర్యంలో మద్దిలపాలెం కళాభారతి ఆడిటోరియంలో గాత్ర విద్వాంసురాలు వీరఘంట లలితా చంద్రశేఖర్ గాత్ర కచేరీ శ్రావ్యంగా సాగింది. సంగీత కళానిధి డాక్టర్ నేదునూరి కృష్ణమూర్తి జన్మదినం సందర్భంగా ఆమెను నేదునూరి స్మారక పురస్కారంతో సత్కరించారు. కచేరీకి వయోలిన్‌పై డాక్టర్ మావూడూరి సత్యనారాయణశర్మ, మృదంగంపై విద్వాన్ దన్వాడ ధర్మారావు, తదితరులు వాయిద్య సహకారం అందించారు. ఈ కార్యక్రమానికి అకాడమీ ప్రతినిధులు బి.ఎ.రాజారావు, పేరాల బాలమురళి, ఎం.ఎస్.శ్రీనివాస్, పప్పు వేణుగోపాలరావు పాల్గొన్నారు.

ఉత్సాహంగా తృతీయ సోపాన్ టెస్టింగ్ క్యాంప్



ఎక్సర్‌సైజ్‌లు చేస్తున్న స్కౌట్స్ అండ్ గైడ్స్

తాటిచెట్లపాలెం: జీవీఎంసీ పరిధి తాటిచెట్లపాలెంలోని వాల్తేరు కేంద్రీయ విద్యాలయంలో సోమవారం నుంచి ప్రారంభమైన స్కౌట్స్ అండ్ గైడ్స్ తృతీయ సోపాన్ టెస్టింగ్ శిబిరంలో రెండవరోజు పలు కార్యక్రమాలు ఉత్సాహంగా జరిగాయి. వ్యాయామం వల్ల కలిగే ప్రయోజనాల గురించి వెటరన్ స్కౌట్ ఎస్ఎస్ మూర్తి వివరించారు. అనంతరం పలు పోటీలు, సాయంత్రం స్కూల్ ప్రాంగణంలో క్యాంప్‌ఫైర్ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా కేవీ–2 ప్రిన్సిపాల్ శ్రీనివాసులు పాల్గొన్నారు. విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. వాల్తేరు కేంద్రీయ విద్యాలయం ప్రిన్సిపాల్ కమల్‌జీత్, ప్రైమరీ స్కూల్ ప్రధానోపాధ్యాయురాలు శైలజ, సిబ్బంది ప్రభాకర్, ఎం.రేఖ, వై.విజయలక్ష్మి, జగన్‌మోహన్, మణిబాబు తదితరులు పాల్గొన్నారు.

కనకమహాలక్ష్మికి అష్టదళ పద్మారాధన



అష్టదళ పద్మారాధనలో సిరులతల్లి

దాబాగార్డెన్స్: బురుజుపేటలో వెలసిన కనక మహాలక్ష్మి దేవస్థానంలో మంగళవారం 108 స్వర్ణ పుష్పాలతో అష్టదళ పద్మారాధన నిర్వహించారు. ఉదయం 7 నుంచి 8 గంటల వరకు నిర్వహించిన ఈ పూజలో పలువురు ఉభయదాతలు పాల్గొన్నారు. కార్యక్రమంలో ఆలయ ఈవో కె. శిరీష, ధర్మకర్తల మండలి చైర్‌పర్సన్ కొల్లి సింహాచలం, ఏఈవో కె. తిరుమలేశ్వరరావు, పర్యవేక్షకుడు ముద్దాడ రమణ, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

12న సహస్ర తులసీదళార్చన ..

కనకమహాలక్ష్మి దేవస్థానంలో ఈ నెల 12న సహస్ర తులసీదళార్చన పూజ నిర్వహించనున్నామని ఈవో కె.శిరీష తెలిపారు. ఈ ప్రత్యేక పూజలో పాల్గొనదలిచే భక్తులు పూజా రుసుం రూ.1500 చెల్లించాలని ఈవో పేర్కొన్నారు.

సింహగిరిపై విశేషంగా ఏకాదశి తిరువీధి



మదనగోపాలస్వామికి తిరువీధి నిర్వహిస్తున్న వైదికులు

సింహాచలం: ఏకాదశి సందర్భంగా సింహగిరిపై మంగళవారం సాయంత్రం మదనగోపాలస్వామికి తిరువీధి నిర్వహించారు. స్వామివారి ఉత్సవ మూర్తులను శోభాయమానంగా అలంకరించి పల్లకిలో వేయింపజేశారు. సింహగిరి మాడ వీధుల్లో తిరువీధి నిర్వహించారు. దివ్యప్రబంధాలను అధ్యాపకులు పఠించారు. విశేషంగా హారతులు అందజేశారు. భక్తులు తరలివచ్చి స్వామిని దర్శించుకున్నారు. ఆలయ అర్చకుడు టి.పి.రాజీవ్‌లోచన్, తదితరులు ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు.

టెన్నిస్ క్రీడాకారిణికి అభినందన



టెన్నిస్ క్రీడాకారిణి సాయి శ్రీఅనిషాను అభినందిస్తున్న వీసీ ప్రసాదరెడ్డి

ఏయూ క్యాంపస్: జాతీయ స్థాయిలో ఆంధ్ర విశ్వవిద్యాలయం నుంచి ప్రాతినిధ్యం వహిస్తూ సౌత్ జోన్ యూనివర్సిటీ పోటీల్లో పాల్గొన్న లాన్ టెన్నిస్ క్రీడాకారిణి కె.సాయి శ్రీఅనిషాను ఏయూ వీసీ ఆచార్య పి.వి.జి.డి.ప్రసాదరెడ్డి మంగళవారం తన కార్యాలయంలో అభినందించారు. ఇటీవల నిర్వహించిన ఖేలో ఇండియా యూనివర్సిటీ పోటీల్లో ఆమె పాల్గొన్నారు. లాన్ టెన్నిస్‌లో ఉన్నత స్థానాలను అధిరోహించాలని వీసీ ఆశాభావం వ్యక్తం చేశారు. అనిషాకు హైదరాబాద్‌కు చెందిన నాట్కో ఫార్మా స్పాన్సర్‌షిప్ అందిస్తుందని ఆమె తండ్రి పరశురామ్ తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏయూ డైరెక్టర్ ఆఫ్ ఫిజికల్ ఎడ్యుకేషన్ ఎస్.విజయ్‌మోహన్, ఏయూ వ్యాయామ విద్యా విభాగాధిపతి ఆచార్య ఎ.పల్లవి, తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు అభినందన



విద్యార్థులను అభినందిస్తున్న జ్యోతి కుమారి

ఏయూ క్యాంపస్: ఆరిలోవ ప్రాంతం తోటగరువు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను ప్రాంతీయ విద్యా సంచాలకురాలు ఎం.జ్యోతికుమారి మంగళవారం సందర్శించారు. పదో తరగతి ఎఫ్ఏ 2 పరీక్షల్లో ప్రతిభ చూపిన విద్యార్థులను అభినందించారు. రానున్న ఎస్ఎస్‌సీ పబ్లిక్ పరీక్షల్లో మంచి మార్కులు సాధించి, జిల్లాకు మంచి పేరు తీసుకురావాలని సూచించారు. ఈ కార్యక్రమంలో చినగదిలి మండల విద్యాశాఖ అధికారి అనూరాధ, స్థానిక పాఠశాల ప్రధానోపాధ్యాయిని జి.కె.డి.భవాని, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పర్యావరణ శాస్త్రంలో కళాగ్రేస్‌కు డాక్టరేట్

ఏయూ క్యాంపస్: ఆంధ్ర విశ్వవిద్యాలయం పర్యావరణ శాస్త్ర విభాగం పరిశోధక విద్యార్థిని లంకపల్లి కళా గ్రేస్‌కి డాక్టరేట్ లభించింది. విభాగ ఆచార్యులు ఎ.జె.సాల్మన్‌రాజు పర్యవేక్షణలో విశాఖ జిల్లా అటవీ ప్రాంతంలో లభించే మూడు జాతుల మొక్కల పునరుత్పత్తి, పెరుగుదల తదితర అంశాలను అధ్యయనం చేశారు. ఈ సందర్భంగా ఏయూ వీసీ ఆచార్య పి.వి.జి.డి.ప్రసాదరెడ్డి నుంచి ఆమె మంగళవారం డాక్టరేట్ ఉత్తర్వులు అందుకున్నారు. ఈ సందర్భంగా కళాగ్రేస్‌ను విభాగ ఆచార్యులు, పరిశోధకులు అభినందించారు.

కూడళ్ల అభివృద్ధి పనులు వేగవంతం

జీవీఎంసీ కమిషనర్ సాయికాంత్ వర్మ



మహారాణిపార్లర్ కూడలి అభివృద్ధి పనులను పరిశీలిస్తున్న జీవీఎంసీ కమిషనర్ సాయికాంత్ వర్మ

సీతంపేట: స్మార్ట్ సిటీ పనుల్లో భాగంగా నగరంలో పలు కూడళ్లలో చేపడుతున్న అభివృద్ధి, రోడ్ల విస్తరణ పనులు వేగవంతం చేయాలని జీవీఎంసీ ఇంజినీరింగ్ అధికారులను జీవీఎంసీ కమిషనర్ సి.ఎం.సాయికాంత్ వర్మ ఆదేశించారు. జీవీఎంసీ జోన్ 3,4,5 పరిధిలోని ప్రభుత్వ ఛాతీ ఆస్పత్రి రోడ్డు, ఏఎస్ఆర్ కాలేజీ గ్రౌండ్ జంక్షన్, అక్కయ్యపాలెం మహారాణి పార్లర్ జంక్షన్, న్యూకాలనీ జంక్షన్ వద్ద జరుగుతున్న అభివృద్ధి పనులను మంగళవారం కమిషనర్ పరిశీలించారు. పెదవాల్తేర్ పోలమాంబ గుడి ఎదురుగా ఉన్న ప్రభుత్వ ఛాతీ ఆస్పత్రి రోడ్డులో విస్తరణ పనులతో పాటు సెంటర్ మీడియన్, గ్రీనరీ అభివృద్ధి పనులు వేగవంతం చేయాలన్నారు. రోడ్డు విస్తరణకు అడ్డంగా ఉన్న చెట్లకు ఎటువంటి నష్టం కలగకుండా రోడ్డు పక్కన గ్రీనరీ ప్రాంతంలోకి మార్పు చేయాలని ఆదేశించారు. నగరంలో రద్దీ దృష్ట్యా స్మార్ట్ సిటీ నిధులతో రోడ్ల విస్తరణతోపాటు కూడళ్లను అభివృద్ధి చేస్తున్నట్టు కమిషనర్ తెలిపారు. ఈ పనుల సందర్భంగా కూడళ్లలో ఉన్న విగ్రహాలకు హాని కలగకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

22న శరీరసౌష్టవ పోటీలకు ఎంపికలు

సీతమ్మధార: ది ఆంధ్రా బాడీబిల్డర్స్ సంఘం ఆధ్వర్యంలో ఈనెల 29న భీమవరంలో నిర్వహించబోయే రాష్ట్ర స్థాయి శరీర సౌష్టవ పోటీలకు జిల్లా స్థాయిలో బాడీబిల్డర్లను ఎంపిక చేస్తున్నట్టు విశాఖ బాడీబిల్డర్స్ అండ్ ఫిట్‌నెస్ సంఘం ప్రధాన కార్యదర్శి బి.కోటిరెడ్డి ఓ ప్రకటనలో తెలిపారు. ఈ నెల 22న హెచ్‌బీకాలనీలో గల మజిల్ ప్లానెట్ జిమ్‌లో ఎంపికలు జరుగుతాయన్నారు.

జీవీఎంసీ షెల్టర్ల సేవలు నిరుపమానం

సీతమ్మధార: కరోనా సమయంలో జీవీఎంసీ షెల్టర్లు ఎంతో మందిని కాపాడాయని ఈస్ట్ ఏసీపీ డీఎస్ఆర్ వీఎస్ఎన్ మూర్తి అన్నారు. నిరాశ్రయులకు అండగా పోలీస్ శాఖ, జీవీఎంసీ, స్వచ్ఛంద సంస్థలు మంగళవారం జీవీఎంసీ గాంధీ విగ్రహం వద్ద ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. వివిధ పోలీస్‌స్టేషన్ల పరిధిలో సిబ్బందికి తగు ఆదేశాలిచ్చి నిరాశ్రయుల పునరావాసం కోసం కలిసి పని చేస్తామని అన్నారు. ప్రతి ఏడాది అక్టోబర్ 10న నిరాశ్రయుల దినోత్సవాన్ని జరుపుకుంటామని ఏయూటీడీ కార్యదర్శి ప్రగడ వాసు తెలిపారు. సహకరిస్తున్న పోలీసులకు కృతజ్ఞతలు తెలిపారు. కేజీహెచ్ అసిస్టెంట్ సూపరింటెండెంట్ రాధాకృష్ణ, జీవీఎంసీ పీవో, లక్ష్మి, ఏయూటీడీ కార్యదర్శి కుమార్ పాల్గొన్నారు.

రైతుబజార్‌లో వివాదం!

- గిరిజన రైతుపై కొబ్బరికాయల వ్యాపారి దాడి
- ఆలస్యంగా వెలుగులోకి..



పెదవాల్తేరు రైతుబజార్

ఏయూ క్యాంపస్: స్థానిక పెదవాల్తేరు రైతుబజార్‌లో ఇద్దరు వ్యాపారుల మధ్య ఘర్షణ చర్చనీయాంశంగా మారింది. అరకు ప్రాంతానికి చెందిన గిరిజన రైతుపై కొబ్బరికాయల వ్యాపారి దాడి చేయడం వివాదాస్పదమైంది. ఈ నెల 1న జరిగిన ఈ సంఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. ఆదివారం మధ్యాహ్నం సుమారు ఒంటి గంట సమయంలో రైతుబజార్‌లో ఇద్దరి మధ్య సెల్‌ఫోన్ చార్జర్ విషయం వివాదానికి దారితీసింది. దీనిపై ఆగ్రహానికి గురైన కొబ్బరికాయల వ్యాపారి బి.చంద్రరావు గిరిజన రైతు జోగినాయుడుపై దాడి చేసి, దుర్భాషలాడారు. ఆ సమయంలో ఎస్టేట్ ఆఫీసర్, అటెండర్‌లు లేకపోవడంతో వివాదం పెద్దదైంది. వెంటనే సదరు గిరిజన రైతు పోలీసులకు ఫిర్యాదు చేస్తానని చెప్పడంతో రైతుబజార్ ఎస్టేట్ అధికారి వచ్చి రాజీ ప్రయత్నాలు ప్రారంభించారు. ఈ నెల 2న కార్యాలయంలో దీనిపై పంచాయితీ పెట్టి ఇద్దరికీ రాజీ కుదిర్చారు. కొబ్బరికాయల వ్యాపారి బి.చంద్రరావుతో క్షమాపణ కోరుతూ లేఖ రాయించారు. గాయపడిన జోగినాయుడుకు చికిత్స చేయిస్తానని హామీ పత్రం రాసి ఇవ్వడంతో వివాదం సద్దుమణిగింది.

కొరవడిన పర్యవేక్షణ

రద్దీగా ఉండే ఆదివారం రోజున రైతుబజార్ అధికారి, సిబ్బంది ఇద్దరూ వివాదం జరిగిన సమయంలో లేకపోవడాన్ని వినియోగదారులు తప్పుపడుతున్నారు. అధికారుల పర్యవేక్షణ లేని కారణంగా కొంత మంది రైతులు సైతం కూరగాయలు, పండ్లు, పువ్వులు తమకు ఇష్టం వచ్చిన ధరలకు విక్రయించడం ఇక్కడ పరిపాటిగా మారిందనే ఆరోపణలు తరచూ వస్తున్నాయి. రైతుబజార్‌లో ఇటువంటి విషయాలన్నీ అధికారుల దృష్టికి వెళ్లకుండా గోప్యంగా జరిగిపోతాయనే వాదన వినిపిస్తోంది. వాస్తవానికి ఈ వివాదం ఈ నెల 1వ తేదీ ఆదివారం రోజున జరిగింది. లేఖలో గత నెల 1న వివాదం జరిగినట్లు పేర్కొనడం గమనార్హం. అదే విధంగా సెప్టెంబర్ 1వ తేదీ ఆదివారం అంటూ లేఖలో రాశారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి రైతుబజార్‌లో ప్రత్యేక దృష్టి సారించాలని వినియోగదారులు కోరుతున్నారు.